మహిళా దినోత్సవం

సాక్షి ఖమ్మం

రేపటికి ముందడుగు

బుధవారం, 8, మార్చి, 2023

తలెత్తుకుంటాం.. తాట తీస్తాం!



- మళ్లీ పుడితే ఆడజన్మే కోరుకుంటాం
- అధికారం ఇస్తే కఠిన శిక్షలు అమలు
- వేధింపులు ఉన్నా.. ఎదుర్కొంటున్నాం

'సాక్షి' సర్వేలో మహిళల మనోగతం



ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో సర్వేలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు (ఇన్‌సెట్) అభిప్రాయాలు వెల్లడిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అవనిలో సగం.. ఆకాశంలో సగం అని చెబుతున్నా అక్కడక్కడా వివక్ష కొనసాగుతూనే ఉంది. అయినప్పటికీ వివక్షను ఎదుర్కొంటూ స్వతంత్ర భావాలతో జీవిస్తున్నాం. అయితే, తమకే కనుక అవకాశం ఇస్తే కలల సామ్రాజ్యాన్ని నిర్మించుకుంటాం.. హింసకు పాల్పడే వారికి కఠిన శిక్షలు అమలు చేస్తాం.. అంటున్న మహిళలు మళ్లీ జన్మించే అవకాశం వస్తే కనక ఆడజన్మనే కోరుకుంటామని చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర చోట్ల సర్వే నిర్వహించింది. మొత్తం 200 మందిని సర్వే చేయగా మళ్లీ జన్మంటూ ఉంటే ఎలా పుట్టాలనుకుంటున్నారు? అనే ప్రశ్నకు 82.5 శాతం(165) మంది ఆడపిల్లగానే జన్మించాలని ఉందని చె ప్పడం మహిళా సాధికారతకు దర్పణం పడుతోంది.

స్వాతంత్ర్యం.. సగమే

సమాజంలో వివక్ష ఉన్నా స్వతంత్రంగా జీవించగలుగుతున్నామని 49 శాతం మంది మహిళలు చెప్పగా.. కొంత మేర స్వాతంత్ర్యం ఉందని 25.5 శాతం మంది.. అలా జీవించలేకపోతున్నామని మిగతా వారు తెలిపారు. ఇక అధికారం అప్పగిస్తే ఏం చేస్తారన్న ప్రశ్నకు మహిళలపై హింస, ఇతర నేరాలకు కఠిన శిక్షలు అమలు చేస్తామని 54.5 శాతం మంది, వివక్ష లేని సమాజాన్ని ఏర్పాటు చేస్తామని 19.5 శాతం మంది, ఆడపిల్లలకు ఉచిత విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని 19.5 శాతం మంది, ఆడవారికి నెలలో నాలుగు రోజులు సెలవు(నెలసరి సమయంలో) ఇస్తామని 6.5 శాతం మంది పేర్కొన్నారు.

ఇంట వివక్ష.. బయట వేధింపులు..

సర్వేలో ప్రధానంగా మహిళలు పని ప్రదేశాలు, విద్యాలయాలు, ప్రయాణ సమయాల్లోనే సోషల్ మీడియాతో ఎక్కువగా వేధింపులకు గురవుతున్నట్లు వెల్లడైంది. మహిళగా ఎక్కువగా ఇబ్బంది ఎదుర్కొన్న అంశం ఏమిటనే ప్రశ్నకు కళాశాలలు, పని ప్రదేశాలు, ప్రయాణాల్లో ఇలా ప్రతిచోట టీజింగ్‌తో ఇబ్బంది ఎదుర్కొన్నట్లు 50.5 శాతం మంది మహిళలు అభిప్రాయపడ్డారు. చిన్నప్పుడు ఇంట్లోనే ఆడా, మగ వివక్షకు గురైనట్లు 33 శాతం మంది చెప్పగా.. సోషల్ మీడియాతో 16.5 శాతం మంది మహిళలు వేధింపులకు గురవుతున్నట్లు తేలింది.

పేరుకే సమానత్వం..



సమాజంలో మహిళలు, పురుషులకు అన్నింట్లో సమానత్వం ఉందని చెబుతున్నా అది మాటలకే పరిమితమవుతోంది. అయితే, మహిళగా ఎన్ని ఇబ్బందులు పడినా మళ్లీ జన్మంటూ ఉంటే మహిళగానే పుట్టాలనేది నా ఆకాంక్ష. మహిళలను ప్రోత్సహిస్తే అన్నింటా ముందుంటారని ఎందరో నిరూపించారు.

– పి.అనిత, కండక్టర్, ఖమ్మం ఆర్టీసీ డిపో

మహిళతోనే సామాజికాభివృద్ధి..



సమాజం అభివృద్ధి చెందాలంటే మహిళలతోనే సాధ్యం. కుటుంబం, సమాజాన్ని నిర్మించడంలో మహిళలది కీలక పాత్ర. అమ్మాయిలపై దాడులు, హింసను అరికట్టాల్సిన అవసరముంది. ఆడా మగ సమానమేనని గుర్తించి కుటుంబంలో కూడా అందరి చదువుకు ప్రాధాన్యమివ్వాలి. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి.

– సీహెచ్.సంధ్యారాణి, డీడబ్ల్యూసీఓ, ఖమ్మం

మహిళలకు రక్షణ కల్పించాలి



యువతులు, మహిళలకు రక్షణ కల్పించేందుకు పాలకులు కొత్త చట్టాలను ప్రవేశపెట్టాలి. ప్రస్తుత పరిస్థితుల్లో జరుగుతున్న పరిణామాలు చూస్తే బాధ కలుగుతోంది. ఈ విషయంలో పాలకులు స్పందించి యువతులు, మహిళల భద్రతను దృష్టిలో పెట్టుకుని చట్టాలను తీసుకొస్తే సమాజంలో వారు స్వేచ్ఛగా తిరిగే అవకాశం ఉంటుంది.

– కె.నందిని, డిగ్రీ సెకండియర్, ఆర్‌జేసీ కళాశాల, ఖమ్మం

అన్యాయంపై పోరాడాలి..



మహిళగా స్వతంత్రంగా జీవించగలుగుతున్నా. అందుకే మరో జన్మంటూ ఉంటే ఆడపిల్లగానే పుట్టాలనుంది. పని ప్రదేశాల్లో మహిళలు వివక్షకు గురవుతున్నట్లు తెలుస్తున్నా దీనిని ధైర్యంగా ఎదుర్కోవాలి. మహిళల రక్షణకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకొచ్చాయి. అలాగే, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్.అంజలి, ట్రాఫిక్ సీఐ, ఖమ్మం

చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి..




ప్రస్తుతం మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించడమే కాదు.. పలు సందర్భాల్లో ఆదర్శంగా నిలుస్తున్నారు. అయినా మహిళలపై దాడులు జరుగుతుండగా, అక్కడక్కడా వివక్షకు గురవుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు మహిళల భద్రతా చట్టాలను మరింత పటిష్టంగా అమలుచేయాలి.

– ఈ.సునీత, ఆర్టీసీ ఉద్యోగి, కొత్తగూడెం

సర్వే సాగింది ఇలా..

1. మీరు మీకు నచ్చిన రీతిలో స్వతంత్రంగా జీవించగలుగుతున్నారా?



2. మహిళగా మిమ్మల్ని ఎక్కువగా ఇబ్బంది పెట్టిన అంశం



3. మీకే పూర్తి అధికారం ఉంటే మహిళల కోసం ఏం చేస్తారు?



4. మళ్లీ జన్మంటూ ఉంటే ఎలా పుట్టాలనుకుంటున్నారు?



విజయ గీతిక లిఖిద్దాం..



'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా పేజీ లే ఔట్‌ను పరిశీలిస్తున్న ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి డానీరూత్

- బాధిత మహిళలకు అండగా నిలవడమే కర్తవ్యం
- ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి డానీరూత్

మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' గెస్ట్ ఎడిటర్‌గా విధులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'మహిళలు తమకు ఎదురయ్యే ఘటనలతో కుంగిపోకుండా.. విధిరాతను ఎదిరిస్తూ విజయ గీతికను లిఖించుకోవాలి.. ఆత్మ విశ్వాసం, పట్టుదలతో సాగితే మహిళలు ఎందులోనూ తీసిపోరు.. ఇదే విషయాన్ని నా దగ్గరకు వచ్చే వారికి చెబుతుంటాను.' అని ఖమ్మం ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.డానీరూత్ పేర్కొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం 'సాక్షి' యూనిట్ కార్యాలయంలో ఆమె గెస్ట్ ఎడిటర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పేజీ లే ఔట్, మహిళా దినోత్సవ ప్రత్యేక కథనాలపై చర్చించిన ఆమె సూచనలు చేశారు.

అన్ని అవకాశాలు రావాలి...

మహిళలు ధైర్యవంతులుగా మారాలని, సమస్యలకు కుంగిపోకుండా ధైర్యంగా నిలబడాలని డానీరూత్ సూచించారు. ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహిళల గాథలను విన్నప్పుడు మరింత ప్రేరణ కలుగుతుందన్నారు. మహిళల స్థితిగతులు మారకుంటే సమాజం అభివృద్ధి చెందదని, సమాజ నిర్మాణంలో సగభాగమైన మహిళ ప్రగతికి మూలమని తెలిపారు. ఆడ, మగ తారతమ్యం ఉండకూడదని, అన్నిరంగాల్లో భాగస్వామ్యాన్ని కల్పిస్తే మహిళలు తమ సమస్యలను తామే పరిష్కరించుకోగలుగుతారని చెప్పారు. అయితే, మహిళలకు ఇంకా కొన్నిరంగాల్లో అవకాశాలు రావాల్సిన అవసరముందని ఆమె అభిప్రాయపడ్డారు.

బాధ్యతల వైపు అడుగులేసి..

న్యాయమూర్తి ఆర్.డానీరూత్ 18 ఏళ్ల వయసులో డిగ్రీ చదువుతుండగా ప్రేమ వివాహం చేసుకున్నారు. డిగ్రీ అనంతరం విజయనగరంలో ఎల్ఎల్‌బీ చదివారు. ఆ సమయంలో వారికి ఇద్దరు ఆడపిల్లలు జన్మించారు. అనంతరం న్యాయవాదిగా 1995లో విజయనగరంలో ఎన్‌రోల్ అయ్యారు. ఏడేళ్ల పాటు ప్రాక్టీస్ చేశారు. ఆ సమయంలో మూడో కుమార్తె జన్మించింది. మొదటి ప్రయత్నంలోనే 2003లో డానీరూత్ న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. అదే ఏడాది భర్త మరణించడం డానీరూత్‌ను కుంగదీసింది. దీంతో దుఃఖంలో మునిగినా.. ముగ్గురు ఆడపిల్లల బాధ్యత ఉండటంతో బాధను దాచుకుంటూ రోజువారీ పనులు కొనసాగించారు. ఓవైపు న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తూనే.. ముగ్గురు పిల్లలకు మంచి భవిష్యత్ ఇచ్చేలా ఉన్నత చదువులు చదివేలా ప్రేరేపించారు.

కుమార్తెలకు రోల్‌మోడల్

డానీరూత్ తన ముగ్గురు కుమార్తెలకు మార్గదర్శకురాలిగా నిలిచారు. మొదటి కుమార్తె తల్లి స్ఫూర్తితో హార్టికల్చర్ పూర్తిచేశాక ఎల్ఎల్‌బీ చదివారు. రెండో కుమార్తె బీహెచ్ఎంఎస్ పూర్తిచేయగా, మూడో కుమార్తె సైతం ఎల్ఎల్ఎం పూర్తిచేసి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. కాగా, తనకు రిటైర్డ్ హైకోర్టు జడ్జి రజని స్ఫూర్తిగా నిలిచారని డానీరూత్ ఈ సందర్భంగా తెలిపారు. 'కెరటం నా ఆదర్శం.. లేస్తూ పడుతుందని కాదు.. పడుతూ లేస్తుందని' అనే సూక్తిని ఉటంకించిన ఆమె.. మహిళలు తమకు ఎదురవుతున్న అడ్డంకులను అధిగమిస్తూ వెళితే విజయం సొంతమవుతుందని వెల్లడించారు.

ఇదో కొత్త అనుభూతి

మహిళా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక పేజీలు, కథనాల రూపకల్పనలో పాలుపంచుకోవడం కొత్త అనుభూతిని ఇచ్చిందని ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.డానీరూత్ వెల్లడించారు. ప్రతీ చోట మహిళలకు దక్కాల్సిన గౌరవం అందితే సమాజం బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేశారు. మహిళలు ఇంట్లో ఉండడం కాదని, సమాజంలోకి వచ్చి తమ కలలను సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకుని అందివచ్చిన అవకాశాలను ఒడిసి పట్టుకుంటే అద్భుతమైన సమాజం ఆవిష్కృతమవుతుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

శ్రీవారికి గరుడ వాహన సేవ



గిరిప్రదక్షణ చేస్తున్న అర్చకులు, సిబ్బంది

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం శ్రీవారికి గరుడ వాహన సేవ నిర్వహించారు. తొలుత శ్రీవారు, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేయగా, సాయంత్రం గరుడ వాహనంపై కూర్చోబెట్టి గిరి ప్రదక్షణ చేశారు. ఈసందర్భంగా భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది. ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఎస్.విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

64 మందికి సదరమ్ సర్టిఫికెట్లు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో మంగళవారం సదరమ్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా 125 మంది దివ్యాంగులు స్లాట్ బుక్ చేసుకోగా, 96 మంది హాజరయ్యారు. వీరికి పరీక్షించిన నిర్వహించిన వైద్యులు 64 మందిని సదరమ్ సర్టిఫికెట్‌కు అర్హులుగా గుర్తించారు.

నేడు నీటి పారుదల మండలి సమావేశం

ఖమ్మంఅర్బన్: జిల్లా నీటి పారుదల సలహా మండలి సమావేశాన్ని బుధవారం ఏర్పాటుచేసినట్లు జల వనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్ తెలిపారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, రైతు సమన్వయ కమిటీ సభ్యులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొనే ఈ సమావేశంలో సాగర్ జలాల వినియోగం, చివరి ఆయకట్టు నీరు పంపిణీపై చర్చించనున్నట్లు తెలిపారు.

కలర్‌ఫుల్.. జాయ్‌ఫుల్ !



జిల్లావ్యాప్తంగా చిన్నాపెద్ద తేడా లేకుండా హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ క్యాంపు కార్యాలయాల్లో కుటుంబీకులు, ఉద్యోగులతో కలిసి కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ రంగుల్లో మునిగితేలారు.

- ఫొటోలు 9లో



ఉద్యోగులతో కలిసి నృత్యం చేస్తున్న కలెక్టర్ గౌతమ్, (ఇన్‌సెట్) డోలు వాయిస్తున్న సీపీ వారియర్

మహిళా దినోత్సవ కానుక!

- ఎస్‌హెచ్‌జీ సభ్యులకు తీపి కబురు
- 2018-19, 2019-20 నాటి వీఎల్ఆర్ బకాయిలు విడుదల
- జిల్లాలో 21,794 గ్రూప్‌లకు రూ.40.82 కోట్లు

ఖమ్మంమయూరిసెంటర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం మహిళలకు తీపికబురు అందించింది. స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏళ్లుగా ఎదురుచూస్తున్న వడ్డీ లేని రుణాల(వీఎల్ఆర్) బకాయిలను విడుదల చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2018-19, 2019-20 సంవత్సరాలకు సంబంధించిన బకాయిలు చెల్లించనున్నట్లు వెల్లడించింది. రెండేళ్లకు కలిపి సంఘాలకు రూ.40,82,43,411 చెల్లించనున్నారు. ఈ నగదు నేరుగా మహిళా సంఘాల సభ్యుల ఖాతాల్లో జమ అవుతుంది.

ఏళ్ల నాటి బకాయిలు

స్వయం సహాయక సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేలా వడ్డీలేని రుణాలు ఇవ్వాలని 2013లో అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత సభ్యులు రుణాన్ని వడ్డీతో చెల్లిస్తే వడ్డీ నగదును ప్రభుత్వం ఆరు నెలలకోసారి తిరిగి ఇచ్చేది. అయితే ఐదేళ్లుగా వడ్డీ సమయానికి రావడం లేదు. 2016-17, 2017-18 ఏడాదికి సంబంధించిన వడ్డీ 2019 సెప్టెంబర్‌లో విడుదలైంది. ఇక 2018-19 ఆర్థిక సంవత్సరం నుంచి అసలే నిలిపివేసింది. జిల్లాలో 2018-19 ఏడాది నుంచి ఇప్పటి వరకు రూ. 111,85,98,000 పేరుకుపోగా... ఇందులో 2018-19, 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిధులు మంజూరయ్యాయి. అయితే, 2020-21, 2021-22కు సంబంధించి వడ్డీ బకాయిలు ఇంకా రూ.57.85కోట్ల వరకు ఉన్నాయి. ఈ సందర్భంగా డీఆర్డీఓ విద్యాచందన మాట్లాడుతూ మహిళా దినోత్సవ వేడుకల్లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేతుల మీదుగా మహిళా సంఘాలకు వీఎల్ఆర్ బకాయి చెక్కులు అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం 'ఏ' గ్రేడ్ సంఘాలకు రెండేళ్ల బకాయిలు చెల్లిస్తూ నిర్ణయం తీసుకుందని, చెక్కులను బ్యాంకుల్లో జమ చేశాక ఒకటి, రెండు రోజుల్లో సభ్యుల ఖాతాలకు చేరతాయని చెప్పారు. అయితే, విడుదలైన నిధుల్లో తేడా ఉన్న నేపథ్యాన మరోమారు ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని ఆమె తెలిపారు.

రూ.30వేలు ఇస్తే పోడు భూమిలో బోరు!

ముగ్గురు అటవీ ఉద్యోగులపై వేటు

కారేపల్లి: అడవులను కాపాడాల్సిన అటవీ ఉద్యోగులే అక్రమార్కులకు చేయూతనిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయం బయటపడడంతో ముగ్గురిని సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వివరాలను కారేపల్లి ఫారెస్టు రేంజ్ ఇన్‌చార్జి ఆఫీసర్ బి.రాధిక మంగళవారం వెల్లడించారు. కారేపల్లి మండలం చీమలపాడు అటవీప్రాంతంలోని పాటిమీదిగుంపు, రేలకాయపల్లి, బోటితండా, రంగురాళ్లబోడు, గేటురేలకాయలపల్లి, చింతలతండా, నానునగర్‌తండాల్లో రూ.30వేల చొప్పున వసూలు చేసి పోడు భూముల్లో 40 బోర్లు వేయించిన సెక్షన్ ఆఫీసర్ సాంబశివరావు, బీట్ ఆఫీసర్లు రమేష్, విజయ రూ.1,20కోట్ల మేర వసూళ్లకు పాల్పడ్డాడు. ఈ తతంగమంతా ఓ ప్రజాప్రతినిధి అండతో సాగినట్లు సమాచారం. అలాగే, బాజుమల్లాయిగూడెంలో పోడు సాగు చేస్తున్న వారి నుంచి డబ్బు వసూలు చేయడం, వేటగాళ్లతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలతో అధికారులు విచారణ చేపట్టారు. ఈమేరకు ముగ్గురిని సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువరించారు.

రాష్ట్రస్థాయిలో మార్మోగాలి..

- కందుకూరును అన్నిరంగాల్లో ఆదర్శంగా నిలుపుతా
- రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంపీలు పార్థసారథిరెడ్డి, రవిచంద్ర,ఎమ్మెల్యే సండ్ర, ఎమ్మెల్సీ మధు



ఒంగోలు జాతి వృషభంతో ఎంపీలు

వేంసూరు/సత్తుపల్లి రూరల్: కందుకూరు పేరు రాష్ట్రమంతటా మార్మోగేలా ఆదర్శంగా తీర్చిదిద్దుతానని.. గ్రామాభివృద్ధి బాధ్యత తనదేనని రాజసభ సభ్యుడు బండి పార్థసారధిరెడ్డి వెల్లడించారు. వేంసూరు మండలం కందుకూరులో వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతీయ స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు, రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధుతో కలిసి ఎంపీ పార్థసారధిరెడ్డి బహుమతులు అందజేశారు. అలాగే, కందుకూరు ఆరోగ్య ఉప కేంద్రానికి అవసరమైన సామగ్రి అందజేశాక పార్థసారధిరెడ్డి మాట్లాడారు. ఎడ్లపందేలతో కందుకూరు పేరు రాష్ట్రస్థాయికి చేరిందని.. ఈ పోటీలు ఎన్నాళ్లు నిర్వహించినా సహకరిస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సండ్ర మాట్లాడుతూ తన రాజకీయ ప్రస్థానం కబడ్డీ పోటీల నిర్వహణతోనే ప్రారంభమైందని గుర్తు చేసుకున్నారు. అంతరించిపోతున్న గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తున్న కందుకూరు వాసులు అభినందనీయులని చెప్పారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు మాట్లాడుతూ జిల్లాలో ఒంగోలు జాతి ఎద్దుల సంతతి అభివృద్ధి సాధించేలా పరిశోధన కేంద్రం ఏర్పాటుకు అంతా కృషి చేస్తామని తెలిపారు. ఈసమావేశంలో పోటీల నిర్వాహకులు మందపాటి వెంకటరెడ్డి, బండి జగదీష్‌రెడ్డి, పాలా వెంకటరెడ్డి, ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ మారోజు సుమలతతో పాటు దొడ్డా శ్రీలక్ష్మి, వెంకటకృష్ణారెడ్డి, గొర్ల ప్రభాకర్‌రెడ్డి, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, తెలగవరపు అప్పారావు, బండి ఉపేంద్రరెడ్డి, జుబ్బూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా, సత్తుపల్లి నుంచి కందుకూరు వరకు తొలుత ఎంపీలు పార్థసారధిరెడ్డి, రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వందలాది కార్లతో ర్యాలీగా వెళ్లారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్‌తో పాటు తోట సుజలరాణి, మట్టా ప్రసాద్, మౌలాలీ, వనమా వాసు, రఫీ, మల్లూరు అంకమరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు జిల్లాలో మంత్రి పువ్వాడ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు ఖమ్మంలోని వీడీవోస్ క్యాంపు కార్యాలయంలో జరిగే మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నాక జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఆతర్వాత భక్తరామదాసు కళాక్షేత్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొని ఎస్‌హెచ్‌జీలకు వీఎల్‌ఆర్ చెక్కులను అందజేయనున్న మంత్రి, మధ్యాహ్నం కలెక్టరేట్‌లో జరిగే జిల్లా నీటిపారుదల మండలి సమావేశంలో పాల్గొంటారు. ఆతర్వాత వేంసూరు మండలం కందుకూరు, ఖమ్మం టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాల్, నగరంలోని శుక్రవారిపేటలో జరిగే కార్యక్రమాలకు కూడా మంత్రి హాజరవుతారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

నేలకొండపల్లి: ఆరుబయట ఆడుకుంటున్న బాలుడిపై వీధికుక్కలు విరుచుకుపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. నేలకొండపల్లి మండలం చెరువుమాదారంలోని సయ్యద్ మస్తాన్ ఇంటికి సూర్యాపేట జిల్లా హుజుర్‌నగర్ మండలంలోని లింగగిరికి చెందిన బంధువుల అబ్బాయి జుబేర్(5) ఇటీవల వచ్చాడు. ఆయన మరికొందరు చిన్నారులతో కలిసి మంగళవారం ఆరుబయట ఆడుకుంటుండగా ఒకేసారి వీధికుక్కలు గుంపులుగా వచ్చాయి. దీంతో పిల్లలంతా భయపడిపోయి పరుగులు తీశారు. వీరిలో జుబేర్‌ను మాత్రం కుక్కలు వెంట పడి తీవ్రంగా గాయపరిచాయి. అక్కడి స్థానికులు కుక్కలను తరిమేసి జుబేర్‌కు నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

అతివలు.. అసాధ్యులు..!

- మొక్కవోని ధైర్యంతో ముందడుగు
- అవాంతరాలను ఎదుర్కొంటూ విజయతీరాలకు..

మహిళా దినోత్సవం

అందరికీ అన్నీ అందవు! కానీ వచ్చే ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుంటూ కొందరు విజయాలు సాధిస్తారు. అలాంటి వారిలో మహిళలెందరో ఉన్నారు. తల్లిదండ్రులు చదువు వద్దన్నా ఒప్పించిన వారు.. భర్త వదిలేసినా కుటుంబ సంసారాన్ని ఈదిన వారు.. తాము విజయం సాధించడంతో పాటు కుటుంబం, పిల్లలను వృద్ధిలోకి తీసుకొచ్చిన ఎందరో మన కళ్ల ముందే కనిపిస్తారు. అలాంటి వారిలో కొందరి విజయ గాథలు నేడు మహిళా దినోత్సవం సందర్భంగా...

ఉమారాణి.. చెల్లెళ్లకు స్ఫూర్తి!



బొల్లికొండ ఉమారాణి, రమాదేవి, స్వరూపారాణి

ఖమ్మంగాంధీచౌక్: స్వయం కృషితో తాను చదువుకోవడమే కాక చెల్లెళ్లను చదివించి ఉన్నత స్థాయికి చేర్చారు ఉమారాణి. కూసుమంచి మండలం చేగమ్మకు చెందిన బొల్లికొండ వెంకన్న–రాజమ్మకు ముగ్గురు కుమార్తెలు మొదటి కూతురైన ఉమారాణి దివ్యాంగురాలు కావడంతో వ్యవసాయ కూలీలైన తల్లిదండ్రులకు చదువు చెప్పించడానికి ఇష్టపడలేదు. అయినా ఉమారాణి టైలరింగ్ నేర్చుకుంటూ చదువు సాగించింది. ఎస్సెస్సీ, ఇంటర్ పూర్తిచేశాక డిగ్రీ కోసం సైకిల్‌పై ఆరు కి.మీ. దూరంలోని కూసుమంచి వెళ్లివచ్చేది. ఆతర్వాత ఖమ్మంలో పీజీ, సూర్యాపేటలో బీఈడీ పూర్తిచేసి 2012లో కేజీబీవీలో ఉపాధ్యాయురాలుగా ఉద్యోగం సాధించి కొణిజర్లలో విధులు నిర్వర్తిస్తోంది. ఇక తన మొదటి చెల్లెలు నర్సింగ్ విద్య చదివేలా ప్రోత్సహించడంతో ఆమె ప్రైవేట్ ఆస్పత్రిలో నర్స్‌గా పనిచేస్తోంది. చిన్న చెల్లెలు స్వరూపారాణి ఇంజనీరింగ్ పూర్తిచేసి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తోంది. అడ్డంకులు వచ్చినా చదువుకుని జీవితంలో స్థిరపడిన అక్కాచెల్లెళ్లను అంతా ప్రశంసిస్తుంటే వారి తల్లిదండ్రులు సంబరపడుతున్నారు.

లాల్‌బీ.. స్వయం కృషితో ముందడుగు

ఖమ్మంగాంధీచౌక్: కృషి, పట్టుదల ఉంటే సాధించలేనిది ఏమీ లేదనడానికి నిదర్శనం లాల్‌బీ. చింతకాని మండలం గాంధీనగర్‌లోని పేద కుటుంబంలో జన్మించిన లాల్‌బీకి చిన్న వయసులోనే సలీంతో వివాహం జరిగింది. వీరికి ఓ పాప జన్మించిక ఆమె ఏడాదిన్నర వయసులో అనారోగ్యంతో సలీం మరణించారు. ఆధారం కోల్పోయిన లాల్‌బీ కూలీ పనులు చేస్తూ స్థానిక ఉపాధ్యాయుల సహకారంతో ఓపెన్ టెన్త్ పూర్తి చేసింది. ఆతర్వాత ఖమ్మం శిశుగృహలో ఆయాగా అవకాశం లభించడంతో కూతురును చదివించుకుంటూ ఖమ్మంకు మకాం మార్చింది. అనంతరం అధికారుల సలహాతో ఓపెన్ ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన ఆమె ఇప్పుడు జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో ఔట్‌రీచ్ వర్కర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. ఆమె కుమార్తె సుబాన్‌బీ డిగ్రీ చదువుతుండగా.. లాల్‌బీ మాట్లాడుతూ ఒంటరి మహిళగా అనేక సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ తిండిలేని రోజులు గడిపినా ధైర్యం కోల్పోలేదని తెలిపారు.



కుమార్తె సుబాన్‌బీతో లాల్‌బీ

అక్కాచెల్లెళ్లు.. ఆఫీసర్లు



విద్యాలత, విద్యాచందన

చుంచుపల్లి: సత్తుపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులైన క్షీరసాగరయ్య – సుగుణకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉండగా.. ఇద్దరు కుమార్తెలు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మంలో జిల్లా స్థాయి అధికారులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో మెరుగు విద్యాలత భద్రాద్రి జిల్లా జెడ్పీ సీఈఓగా, విద్యాచందన ఖమ్మం డీఆర్డీఓగా ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులైన తమ తల్లిదండ్రులు క్రమశిక్షణతో పెంచారని, ఎక్కడా ఆడమగ వివక్ష చూపలేదని తెలిపారు. దీంతో ఉన్నత విద్యనభ్యసించి మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డామన్నారు. ఇక తమ సోదరుడు ఆర్‌అండ్‌బీ శాఖలో ఈఈగా ఉన్నారని.. ముగ్గురం మంచి ఉద్యోగాల్లో స్థిరపడడానికి కష్టపడి చదువుకోవడం, అంది వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవడమే కారణమని తెలిపారు. కాగా, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే మహిళలను అందరూ గౌరవించాలని, తల్లిదండ్రులు కూడా ఇళ్లలో పిల్లలను ఆడమగ తేడా లేకుండా పెంచితే జీవితంలో ఎదుగుతారని విద్యాలత, విద్యాచందన వెల్లడించారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,781

ఉత్సవ శోభ షురూ..

భద్రగిరిలో శ్రీరామనవమి పనులు ప్రారంభం

- సంప్రదాయబద్ధంగా పసుపు దంచే వేడుక
- వసంతోత్సవంలో 'వరాల రామయ్య'
- శ్రీ సీతారాములకు వైభవంగా డోలోత్సవం



స్వామి వారి కల్యాణ తలంబ్రాలను కలుపుతున్న భక్తులు



పంచామృతాలతో స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని మిథిలా స్టేడియంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవ శోభ ప్రారంభమైంది. ముక్కోటి వేడుకలు జరిగే ఉత్తర ద్వారం వద్ద స్వామివారి ఉత్సవ మూర్తులు దర్శనమివ్వడంతో భక్తులు పులకించిపోయారు. వారు చేసిన శ్రీరామ నామస్మరణలతో ఆ ప్రాంతం పులకించింది. ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా బేడా మండపంలో జరిగిన వసంతోత్సవంతో భద్రాద్రి రామయ్య పెళ్లి కుమారుడిగా మురిసిపోయాడు. భక్తుల జయజయధ్వానాలు, అర్చకుల వేదమంత్రాలు, మేళతాళాల నడుమ ఊంజల్ సేవ నిర్వహించగా స్వామివారు పరమానందభరితులయ్యారు. వెరసి.. మంగళవారం భద్రాచలంలో ఉత్సవ శోభ సంతరించుకుంది.

సంప్రదాయబద్ధంగా తలంబ్రాల తయారీ..

రామయ్య కల్యాణానికి వినియోగించే తలంబ్రాల తయారీని ప్రతి సంవత్సరం ఫాల్గుణ పౌర్ణమి రోజున చిత్రకూట మండపంలో నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది ఆ క్రతువును ఉత్తర ద్వారం వద్దకు మార్చారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాటాల నడుమ పల్లకీ సేవగా స్వామివారి ఉత్సవమూర్తులను ఉత్తర ద్వారం వద్దకు తీసుకొచ్చి ఆశీనులను చేశారు. అర్చకులు, వేద పండితులు స్వామి, అమ్మవార్లకు, రోళ్లు, రోకళ్లకు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల, వేద పండితుల సతీమణులు, శ్రీవైష్ణవ ముత్తయిదువలు తొలుత పసుపు కొమ్ములను దంచి పెళ్లి పనులు ప్రారంభించారు. అనంతరం బియ్యంలో పసుపు, రోజ్‌వాటర్, గులామ్, సుగంధద్రవ్యాలు, అత్తరు పోసి తలంబ్రాలు కలిపారు. మొదట తయారుచేసిన తలంబ్రాలను ఆలయ అధికారులు తలపై ధరించి స్వామివారి మూలమూర్తుల పాదాల చెంతన ఉంచారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన తలంబ్రాల తయారీలో పాల్గొన్నారు.

వైభవోపేతంగా డోలోత్సవం, వసంతోత్సవం

ఫాల్గుణ పౌర్ణమి సందర్భంగా భద్రాద్రి రామయ్యకు వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించారు. బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు పంచామృతాలతో కలశాభిషేకం, సహస్రధారతో స్నపనం జరిపించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఊయలపై శ్రీ సీతాలక్ష్మణసమేతుడైన రామచంద్రస్వామి వారిని ఆశీనులను చేశారు. ఆస్థాన గాయకులు రామదాసు కీర్తనలను ఆలపిస్తుండగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి నక్షత్ర హారతి సమర్పించారు. అర్చకులు శ్రీ సీతారాములపై రంగులు చల్లి వసంతోత్సవాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులపై అర్చకులు, సిబ్బంది పసుపునీళ్లు, రంగులు చల్లారు. ఈ సందర్భంగా బేడా మండపం రంగుల మయంగా మారింది. ఆలయ సిబ్బంది సైతం ఆనందోత్సాహాలతో రంగులు చల్లుకున్నారు.

గోటి తలంబ్రాలతో తరలివచ్చిన భక్తులు..

స్వామివారి తలంబ్రాలను కలిపే వేడుకకు పలు జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తాము గోటితో వలిచిన తలంబ్రాలను కల్యాణ తలంబ్రాలలో కలిపి భక్తిని చాటుకున్నారు. ప్రత్యేక బస్సులు, ప్రైవేటు వాహనాల్లో కొందరు, పాదయాత్రగా మేరి కొందరు తరలిరాగా, ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. బహిరంగ ప్రదేశంలో నిర్వహిస్తున్న ఈ క్రతువుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని తెలిసినా.. ఆలయ అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది ఆ మేరకు బందోబస్తు ఏర్పాటు చేయకపోవడంతో కొంత తోపులాట చోటుచేసుకుంది. ఆయా కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, విజయరాఘవన్, స్థానాచార్యులు స్థలశాయి, వేదపండితులు, అర్చకులు, ఆర్‌డీఓ రత్నకళ్యాణి, ఆలయ ఏఈఓలు శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లోక్యాతండాలో ప్రారంభమైన హోలీ వేడుకలు



హోలీ పాటలు పాడుతున్న మహిళలు

కూసుమంచి: మండలంలోని లోక్యాతండాలో మూడు రోజులపాటు జరుగనున్న హోలీ వేడుకలు మంగళవారం కోలాటంతో ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా వేడుకల పెద్ద గేరియా భేరి కొట్టి వేడుకలు ప్రారంభమైనట్లుగా ప్రకటించారు. తండాలోని ప్రతీ ఇంటికి బంధువులు రావడంతో పండుగ సందడి నెలకొంది. సర్పంచ్ జర్పుల పద్మతో పాటు స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఖమ్మంలీగల్: విద్యార్థి దశ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన కోయచెలకలోని బాలికల హాస్టల్‌లో మంగళవారం నిర్వహించిన న్యాయచైతన్య సదస్సులో ఆయన మాట్లాడారు. న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ జావేద్ పాషా, ప్రిన్సిపాల్ విద్యాధరి పాల్గొన్నారు.

మూడు రోజులైనా జాడలేదు..

నేలకొండపల్లి: చెరుకు నరికేందుకు వచ్చిన కూలీ గల్లంతై మూడు రోజులు అవుతున్నా ఆచూకీ దొరకలేదు. ఏపీలోని ప్రకాశం జిల్లా పుల్లల చెరువు గంగారానికి చెందిన కె.రూప (17) మరికొందరితో కలిసి మండలంలోని రాజేశ్వరపురం రాగా ఆదివారం సాయంత్రం సాగర్ కాల్వలో గల్లంతైంది. అయితే, పలు అనుమానాల నేపథ్యాన రూప మేనమామ మర్రిదాసును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉపాధి కోసం వచ్చిన కూలీ ఆచూకీ కోసం అధికారులు గాలింపు ముమ్మరం చేయాలంటూ ఎమ్మార్పీఎస్, కాంగ్రెస్ నాయకులు వి.ఆనందరావు, పి.బాలస్వామి, వి.వెంకటేశ్వర్లు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, వై.నాగరాజు, పగిడికత్తుల సుదర్శన్ తదితరులు డిమాండ్ చేశారు.

ఎన్నెస్పీ కార్యాలయం ఎదుట దీక్ష

బోనకల్: చివరి ఆయకట్టుకు నీరందక మొక్కజొన్న పంట ఎండిపోతోందని ఆరోపిస్తూ మండలంలోని ఆళ్లపాడు, గోవిందాపురం గ్రామాల ప్రజాప్రతినిధులు, రైతులు బోనకల్‌లోని ఎన్నెస్పీ కార్యాలయం ఎదుట మంగళవారం 24గంటల దీక్ష చేపట్టారు. ఈమేరకు సర్పంచ్‌లు మర్రి తిరుపతిరావు, భాగం శ్రీనివాసరావుతో పాటు రైతులు దీక్షలో పాల్గొనగా, అధికార పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ తమ దీక్షతోనైనా అధికారులు స్పందించి వారబంధీ విధానం ఎత్తేయాలని కోరారు. రైతులు పారా ప్రసాద్, కాసాని పరశురాం, చెన్నకేశి పెద్దవెంకయ్య, అల్లిక అబ్బయ్య, హన్మంతరావు, బెజవాడ దానయ్య, దొంతుబోయిన కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నెస్పీ అధికారుల తీరుతోనే సమస్య

కల్లూరు రూరల్: సాగర్ డ్యాంలో పుష్కలంగా నీరు ఉన్నా ఖమ్మం, నల్లగొండ జిల్లాల జలవనరుల శాఖ అధికారుల నడుమ సమన్వయ లోపంతోనే పంటలకు సాగునీరు అందడం లేదని సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకట వీరయ్య ఆరోపించారు. కల్లూరు మండలం చెన్నూరులో ఆయన మాట్లాడగా ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, నాయకులు పాలెపు రామారావు, లక్కినేని రఘు, లక్ష్మణ్‌రావు, అంజయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి రెండు జిల్లాల్లో పర్యవేక్షణ

ఖమ్మంఅర్బన్: సాగర్ ప్రాజెక్టు నుండి పాలేరు రిజర్వాయర్ వరకు నల్లగొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో నీటిని పంటలకే వాడుతున్నారా, ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారా అనే అంశాన్ని బుధవారం నుంచి పర్యవేక్షించనున్నారు. ఈమేరకు ఇద్దరు ఈఈలు, ఇద్దరు డీఈలను ఇందుకోసం కేటాయించినట్లు తెలిసింది. కాగా, బుధవారం జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం జరగనున్న నేపథ్యాన సీఈ శంకర్‌నాయక్ ఇంజనీర్లతో మంగళవారం సమావేశమై సమీక్షించారు.



బోనకల్ ఎన్నెస్పీ కార్యాలయం ఎదుట దీక్షలో రైతులు, నేతలు